తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

సంపుటి: 1 సంచిక: 40 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ బుధవారం 11-09-2023 వెల: 5/రూ -






## సుప్రీం మార్గదర్శకాల మేరకు.. బీసీ రిజర్వేషన్లను నిర్ధారించండి

### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం..

### 3 నెలల సమయం కోరిన అడ్వొకేట్ జనరల్

హైదరాబాద్: వికాస్ కిషన్‌రావ్ గవాలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు బీసీ రిజర్వేషన్లను నిర్ధారించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 'స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలుపై అధ్యయనానికి రాజ్యాంగబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేయాలి.. సామాజిక, రాజకీయ అంశాలు, వెనుకబాటుతనం లాంటి అంశాలను పరిశీలించి జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు నిర్ధారించాలి.. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లన్నీ 50 శాతానికి మించకూడదు' అని వికాస్ కిషన్‌రావ్ గవాలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో పేర్కొన్న ఈ మూడు సూత్రాలను తప్పకుండా పాటించాలని స్పష్టం చేసింది. దీన్ని అమలు చేసేందుకు మూడు నెలల సమయం కావాలని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి కోరారు. దీంతో తదుపరి విచారణను 3 నెలలకు వాయిదా వేస్తూ, అప్పటిలోగా నివేదిక అందజేయాలని తేల్చిచెప్పింది. రాష్ట్రంలో బీసీల జనాభా వివరాలను సేకరించడానికి, సర్వేల నిర్వహణకు తెలంగాణ బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను

(మిగతా 2వ పేజీలో)

# అప్పులను పునర్వ్యవస్థీకరించాలి

- చెల్లింపు గడువు కాలాన్ని పెంచుకునేలా.. వడ్డీలు తగ్గించుకునేలా రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలి
- 16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ వినతి.. పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచండి
- జీఎస్‌డీపీ ఆధారంగా వాటాను నిర్ధారించండి..తలసరి ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకోవద్దు
- వాటా నిర్ధారణలో జీఎస్‌డీపీకి 50 వెయిటేజ్ కావాలి.. సీఎస్ఎస్‌ల రూపకల్పన బాధ్యతలు రాష్ట్రాలకివ్వండి
- మాకు సహకరించండి.. మోదీకి సహకరిస్తాం.. ఆర్థిక సంఘంతో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల భేటీ





హైదరాబాద్, సెప్టెంబరు 10 : తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. భారీ రుణభారం సవాల్‌గా మారిందని రాష్ట్ర ప్రభుత్వం 16వ కేంద్ర ఆర్థిక సంఘం దృష్టికి తీసుకెళ్లింది. గత ప్రభుత్వం పదేళ్లలో భారీగా అప్పులు చేసిందని, దీంతో రాష్ట్ర ఆదాయంలో అధిక భాగం ఆ అప్పులను తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సి వస్తోందని తెలిపింది. ఈ అప్పుల భారం రాష్ట్రంలో అభివృద్ధి పనులకు ఆటంకంగా పరిణమిస్తుందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా.. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ అవసరాల కోసం తీసుకున్న అప్పులను పునర్వ్యవస్థీకరణ (రీస్ట్రక్చరింగ్) చేసుకునే అవకాశం కల్పించాలని ఆర్థిక సంఘాన్ని కోరింది. అప్పులకు వడ్డీలు తగ్గించుకునేందుకు వీలుగా చెల్లింపు గడువు కాలాన్ని పెంచుకునే అవకాశం ఇవ్వాలని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేసింది. మంగళవారం 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అర్వింద్ పనగడియా ఆధ్వర్యంలోని బృందంతో ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులు, వడ్డీ చెల్లింపులు తదితర వివరాలను ఆర్థిక సంఘానికి తెలపడంతోపాటు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు. రాష్ట్రాల పన్నుల వాటాను తలసరి ఆదాయం ఆధారంగా కాకుండా జీఎస్‌డీపీ ఆధారంగా నిర్ధారించాలని డిమాండ్ చేశారు.

2లో



## హైడ్రాకు పోలీస్‌స్టేషన్.. భారీగా సిబ్బంది కేటాయింపు




## ఆరు నెలలుగా జీతాలివ్వని సర్కార్

- దవాఖానల విధుల బహిష్కరణకూ వెనుకాడం
- మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ నేత నరసింహ
- టీవీవీపీ దవాఖానల ఎదుట కార్మికుల ఆందోళన
- ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలి: హరీశ్‌రావు



# ఏలేరు విలయం

- కాకినాడ జిల్లాలోని 62 గ్రామాలు జలదిగ్బంధం
- నీట మునిగిన నివాసాలు
- కాలువలకు గండ్లతో 45 వేల ఎకరాల్లో పంటలు ధ్వంసం
- కొట్టుకుపోయిన కోళ్లఫారాలు.. ఇటుక బట్టీలు, గడ్డివాములు
- పిఠాపురం-గొల్లప్రోలు హైవేపైకి భారీగా వరద.. రాకపోకలు బంద్

ఏలేరుకు పోటెత్తిన వరదతో కాకినాడ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఉన్న 62 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకు న్నాయి. ఏలేరు రిజర్వాయరుకు అత్యంత భారీగా వరద వస్తుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదిలేస్తుండడంతో ముంపు అధికంగా ఉంది. దీంతో జిల్లాలో ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాలు నీటమునిగాయి. ఏకంగా 62 గ్రామాల్లో ఇళ్లు నీటమునిగి ప్రజలు విలవిల్లాడుతున్నారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి సమీపంలో ఏలేరు కాల్వకు గండి పడడంతో గ్రామం మొత్తం పీకల్లోతు వరదలో మునిగిపోయింది. ఇళ్లల్లో వస్తువులన్నీ వరదకు కొట్టుకుపోయాయి. ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ బురదలో కూరుకుపోయాయి. దుస్తులు, వంటపాత్రలు సైతం కొట్టుకుపోయాయు. ఇలా అనేక గ్రామాలు వరదతో నీటమునిగాయి. ముంపు గ్రామాల్లో పాడిపశువులు కొట్టుకుపోతాయనే భయంతో చాలామంది పశువులను ఇళ్లలోకి తెచ్చుకుని కాపాడుకుంటున్నారు. విద్యుత్ కోతతో బిక్కుబిక్కుమని గడుపుతున్నారు. మంగళవారం నాటికి వరద మహోగ్రరూపం దాల్చింది. కాలువల సామర్థ్యం 10 వేల క్యూసెక్కులు కాగా,

(మిగతా 2వ పేజీలో)



2లో

## పెంట్లవెల్లి రైతుల గోడు తీర్చండి!

- పెంట్లవెల్లి పరిధిలో ఒక్కరికీ కాని రుణమాఫీ
- ముఖ్యమంత్రి మాటలు పచ్చి బూటకం
- పావుశాతం కూడా చేయకుండా వందశాతం చేశామంటూ పోజులు
- గురుకులాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి : కేటీఆర్


హైదరాబాద్: రుణమాఫీ పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి మాటలు బూటకమని చెప్పడానికి పెంట్లవెల్లి రైతుల గోసే సజీవ సాక్ష్యమని

## ప్రకాశం బ్యారేజిని కూల్చి లక్ష మందికి పైగా ప్రజలను చంపాలనేదే జగన్ లక్ష్యం: నారా లోకేశ్

- ఇటీవల ప్రకాశం బ్యారేజ్ గేట్లను ఢీకొట్టిన బోట్లు
- గతంలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోవడానికి కారణమయ్యారు లోకేశ్



2లో




2లో

## కేంద్రం ఇలాగేనా ప్రవర్తించేది?: షర్మిల

- ఏపీలో వరదలు అతలాకుతలం చేశాయన్న షర్మిల
- విజయవాడ రైల్వే డివిజన్ ద్వారా కేంద్రానికి రూ.6 వేల కోట్ల ఆదాయం వస్తోందని వెల్లడి
- వరద బాధితులకు కేంద్రం కనీసం ఉచితంగా మంచినీరు కూడా ఇవ్వలేదని ఆగ్రహం
- రైల్ నీర్ ప్లాంట్ విశాఖలోనే ఉందని వెల్లడి



## ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు సర్వసాధారణం

శంకర్ పల్లి మాజీ సర్పంచ్ బీసొల్ల శ్రీధర్: ఉపాధ్యాయులు వాళ్ళ జ్ఞానాన్ని ప్రతి ఒక్క ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించాలి: శంకర్పల్లి : సెప్టెంబర్ 10 (డైలీ రిపోర్ట్): ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా పనిచేయాలి, అప్పుడే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని శంకర్పల్లి మాజీ సర్పంచ్ బీసొల్ల శ్రీధర్ పేర్కొన్నారు. ఇటీవల శంకర్ పల్లి పట్టణ కేంద్రంలోని గణేష్ నగర్ ప్రాథమిక పాఠశాల నుంచి కొండకల్ తాండ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు రాములుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నగర్ లోని ప్రాథమిక పాఠశాల లో మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. గతంలో తాను సర్పంచిగా పనిచేసిన సమయంలో పాఠశాలను ఎప్పటికప్పుడు సందర్శించే వాడినని వారికోసం ప్రతి సమయంలో కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. కాగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు పాటు పాడాలని కోరారు. విద్యతోనే ప్రతి ఒక్కరి జీవిత లక్ష్యం ఆధారపడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎంపికైన మోత్కుపల్లి అశోకుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుకన్య, ఉపాధ్యాయులు పుష్పలత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం ఇలాగేనా ప్రవర్తించేది?: షర్మిల

"కేంద్ర ప్రభుత్వానికి విజయవాడ రైల్వే డివిజన్ ద్వారా ఏడాది రూ.6 వేల కోట్ల ఆదాయం వస్తుంది. రైల్వే శాఖ సరఫరా చేసే 'రైల్ నీర్' (తాగునీరు) ప్లాంట్ మా విశాఖపట్నంలోనే ఉంది. మన విజయవాడ డివిజన్ ద్వారా ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుంటే వరద బాధితులకు కనీసం మంచినీరు అందించడానికి కూడా కేంద్రం ముందుకు రావడంలేదు. వరద బాధితులకు రైల్ నీర్ వాటర్ బాటిళ్లు ఉచితంగా ఇవ్వాలని కాంగ్రెస్ తరపున నేను లేఖ రాసినా పట్టించుకోలేదు. సంవత్సరానికి రూ.6 వేల కోట్ల ఆదాయం అందిస్తున్న ప్రజలు ఇంతటి ఘోర విపత్తుతో తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే మోదీ ప్రభుత్వం ఇంత కఠినంగా ఎలా ఉండగలుగుతోంది? రాష్ట్ర ప్రజల పట్ల కేంద్రం ఇంత దారుణ నిర్లక్ష్యంతో వ్యవహరిస్తుంటే చంద్రబాబు ఇంకా మోదీకి ఎందుకు మద్దతు ఇస్తున్నట్టు?" అని షర్మిల విమర్శించారు. "చంద్రబాబు చిన్న పిల్లల దగ్గర కాదు డబ్బులు తీసుకోవాల్సింది. బీజేపీ నుంచి ముక్కుపిండి డబ్బులు తీసుకోవాలి. గత 10 ఏళ్ల నుంచి రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు మోదీకి ఊడిగం చేశారు. ఇప్పుడు కూడా చేస్తున్నారు. చంద్రబాబు చిన్న పిల్లల దగ్గర డబ్బులు తీసుకోవడం పబ్లిసిటీ స్టంట్ మాత్రమే. చిన్న పిల్లల దగ్గర డబ్బులు తీసుకోవడం మాని బీజేపీ నుంచి రూ.10వేల కోట్లు తీసుకుని రావాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాను. మిత్రధర్మంలో ముచ్చట్లు కాదు, నిధులు కావాలి" అని షర్మిల స్పష్టం చేశారు.

## పెంట్లవెల్లి రైతుల గోడు తీర్చండి!

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలోని పెంట్లవెల్లిలో ఉన్న 499 మంది రైతుల్లో ఒకరికీ రుణమాఫీ కాకపోవడం పచ్చిమోసం కాక మరేమిటని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. డిసెంబర్ నుంచి ఆగస్టు 15 వరకు డెడ్‌లైన్లు పెట్టిన సీఎం.. నేటివరకూ వీరికి రుణమాఫీ ఎందుకు కాలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పావుశాతం కూడా మాఫీ చేయకుండా వందశాతం అయిపోయినట్టు ముఖ్యమంత్రి పోజులు కొడుతున్నారని విమర్శించారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెంట్లవెల్లి రైతుల రుణాలను మాఫీ చేసి వారి గోడు తీర్చాలని డిమాండ్ చేశారు.


%మరోవైపు గురుకులాల్లో విద్యార్థులు వరుసగా అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు రోజుల్లో సిర్పూర్‌లో 35 మంది గురుకుల విద్యార్థులు జ్వరాలబారిన పడ్డారని ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. బాగాలేని విద్యార్థులను తల్లిదండ్రుల వద్దకు పంపి చేతులు దులుపుకోవడం అంటే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమేనని పేర్కొన్నారు. ఇంత జరుగతున్నా సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కనీసం స్పందించడం లేదని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గాలికొదిలి, బీఆర్ఎస్ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతాపం చూపుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదోడి బతుకు ఆగమాగమైందని విమర్శించారు. తాము ప్రకటించిన గృహజ్యోతికి తూట్లు పొడిచిన కాంగ్రెస్, ఇప్పుడు బీఆర్ఎస్ అమలు చేసిన 20 వేల లీటర్ల ఉచిత మంచినీటి పథకంపై కుట్రలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

## ప్రకాశం బ్యారేజిని కూల్చి లక్ష మందికి పైగా ప్రజలను చంపాలనేదే జగన్ లక్ష్యం: నారా లోకేశ్



ప్రకాశం బ్యారేజి గేట్లను బోట్లు ఢీకొట్టిన ఘటన పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంది. ఈ బోట్లను వైసీపీ వాళ్లే కుట్రపూరితంగా వదిలారని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో, మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం బ్యారేజిని కూల్చి లక్ష మందికి పైగా ప్రజలను చంపాలనేది జగన్ లక్ష్యమని ఆరోపించారు. "గత ప్రభుత్వ హయాంలో సైకో జగన్ తన ఇసుక మాఫియా కోసం అన్నమయ్య డ్యామ్ ను కొట్టుకుపోయేలా చేసి ప్రాణ నష్టానికి కారణమయ్యారు. 50 మందిని చంపేసి, ఐదు గ్రామాలను నామరూపాల్లేకుండా చేశారు. ఇప్పుడు ప్రకాశం బ్యారేజిని ఇనుప పడవలతో ఢీకొట్టి కూల్చాలన్ని కుట్ర చేశారు. విజయవాడతో పాటు పదుల సంఖ్యలో లంక గ్రామాలను నామరూపాల్లేకుండా చేయాలన్న సైకో జగన్ కుట్ర బయటపడింది. ప్రజలను జలసమాధి చేయాలన్న కుట్రకు ప్లాన్ చేసింది సైకో జగన్ అయితే... ఆ ప్రణాళికను అమలు చేసింది తలశిల రఘురాం, నందిగం సురేశ్" అంటూ నారా లోకేశ్ వివరించారు. తమ కుట్రలు బయటపడకుండా... వరద ముంపునకు కారణం ప్రభుత్వమే అంటూ సైకో జగన్ ముఠా విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

# అప్పులను పునర్వ్యవస్థీకరించాలి





(మొదటి పేజీ తరువాయి)

అంతేకాకుండా కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎసఎసల)ను రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ఆయా రాష్ట్రాలే రూపొందించుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున చేసిన విజ్ఞప్తుల వివరాలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మీడియాకు వివరించారు.

### రాష్ట్ర పురోగతిపై ప్రభావం..

డిప్యూటీ సీఎం తెలిపిన వివరాల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్ర అప్పు రూ.6.85 లక్షల కోట్లకు పైగా ఉందని ఆర్థిక సంఘానికి ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలోని ఉద్యోగుల జీత భత్యాలు, సర్వీసు పెన్షన్లకు ప్రతి నెలా రూ.5 వేల కోట్ల మేర వ్యయం చేస్తుంటే... అప్పుల అసలు, వడ్డీ చెల్లింపులకు రూ.5,200 కోట్ల వరకు వ్యయం చేయాల్సి వస్తుందని

(మిగతా 2వ పేజీలో)

వివరించింది. అప్పట్లో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫసీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ)ల నుంచి 11 శాతం, 11.5 శాతం వంటి అత్యధిక వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చారని గుర్తు చేసింది. రుణాలు, వడ్డీ చెల్లింపులు ఇప్పుడు సక్రమంగా నిర్వహించకపోతే.. రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రానికి తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కోరింది. ఇందుకోసం రుణాలను రీస్ట్రక్చర్ చేసే అవకాశమైనా ఇవ్వాలని, లేదా రాష్ట్రానికి అదనపు ఆర్థిక సహాయమైనా అందించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

### తలసరి ఆదాయం ఆధారంగా వాటాతో అన్యాయం

రాష్ట్రాల జనాభా, తలసరి ఆదాయాల ఆధారంగా కాకుండా... రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎసడీపీ) ఆధారంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను నిర్ధారించాలని ఆర్థిక సంఘాన్ని ప్రభుత్వం కోరింది. తలసరి ఆదాయం, జనాభా ఆధారంగా వాటాను నిర్ధారించడం వల్ల తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని ప్రభుత్వం తెలిపింది. జనాభాను నియంత్రిస్తూ జీఎసడీపీని పెంచుకుంటున్న రాష్ట్రాలకు ప్రస్తుత విధానం ప్రతిబంధకంగా మారిందని ఆక్షేపించింది. తెలంగాణ రాష్ట్రంలో మొదటి నుంచి జనాభాను నియంత్రిస్తున్నామని, తద్వారా జనాభా తగ్గిపోయి, తక్కువ వాటా వస్తోందని తెలిపింది. ఎలాంటి జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రం అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని, ఈ విధానం సరికాదని ఆక్షేపించింది. ఒక రాష్ట్రంలోని జిల్లాల వారీగా చూసినా... తలసరి ఆదాయంలో భారీ అంతరం ఉందని పేర్కొంది. ఉదాహరణకు తెలంగాణలోని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఉండగా, వికారాబాద్ వంటి జిల్లాల తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉంటుందని గుర్తు చేసింది. ఇలాంటి ఆర్థిక అసమానతల దృష్ట్యా.. తలసరి ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకోవద్దని కోరింది. కేవలం తలసరి ఆదాయంతో రాష్ట్రాల శ్రేయస్సును కొలవడం వల్ల రాష్ట్రంలోని ఆర్థిక అసమానతలు తొలగిపోవని పేర్కొంది. తెలంగాణ, హరియాణా వంటి రాష్ట్రాలు అత్యధిక జీఎసడీపీని సాధిస్తూ 'స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)'కి ఎక్కువ మొత్తం భాగస్వామ్యం అందిస్తున్నాయని చెప్పింది. దేశంలో తెలంగాణ జనాభా 3 శాతం ఉండగా... జీడీపీకి రాష్ట్రం అందించే జీఎసడీపీ వాటా 5.1 శాతంగా ఉందని ప్రభుత్వం గుర్తు చేసింది.జీఎసడీపీ ఎక్కువగా ఉంటే... రాష్ట్రాలు పెట్టుబడులను ఆకర్షించవచ్చని, ఉద్యోగాలను సృష్టించవచ్చని, అంతిమంగా జాతీయ ఆర్థిక వ్యవస్థకు దోహదపడవచ్చని ఆర్థిక సంఘానికి ప్రభుత్వం వివరించింది. పైగా ఈ విధానం రాష్ట్రాల మధ్య మరింత పోటీ పెంచుతుందని, సమతుల అభివృద్ధికి బాటలు వేస్తుందని పేర్కొంది. 2027-28 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే భారతదేశ లక్ష్యంతో ఇది సరితూగుతుందని విశ్వసిస్తున్నామని తెలిపింది. రైతు భరోసా, వ్యవసాయ రుణాల మాఫీ, ఆహార సబ్సిడీలు వంటి కార్యక్రమాలు బలహీన వర్గాలకు ఆర్థిక స్థిరత్వాన్ని, సామాజిక భద్రతను కలిగిస్తాయని, ఇలాంటి వాటికి 'ఉచితాలు' అని ముద్ర వేసి, పన్నుల వాటా నిర్ధారణ సందర్భంలో పరిగణనలోకి తీసుకోవద్దని కోరింది.

# ఆరు నెలలుగా జీతాలివ్వని సర్కార్

## ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలి: హరీశ్‌రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 : టీవీవీపీ దవాఖానల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, ఇప్పటికైనా వేతనాలు చెల్లించకుంటే విధులను బహిష్కరించడానికి కూడా వెనుకాడబోమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ హెచ్చరించారు. ఏరియా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులు మంగళవారం దవాఖానల ఎదుట గంటపాటు ధర్నా నిర్వహించారు. తమకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని టీవీవీపీ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ కింగ్ కోఠిలో జరిగిన ధర్నాలో నరసింహ పాల్గొని మాట్లాడారు. కొన్ని దవాఖానల్లో నాలుగు నెలలుగా, మరికొన్ని దవాఖానల్లో ఆరు నెలలుగా సిబ్బందికి జీతాలు అందలేదని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి టీవీవీపీ దవాఖానలకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేయలేదని చెప్పారు. జీతాలు అందక కార్మికులు అవస్థలు పడుతున్నారని, వారి కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీవీపీ కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసినా స్పందన రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఒకవైపు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని చెప్తున్నా, కార్మికులు ఆరేడు నెలలుగా పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. ప్రస్తుత సీజనల్ వ్యాధులు, వర్షాలను దృష్టిలో పెట్టుకొని గంటపాటు మాత్రమే ధర్నాలు చేస్తున్నామని, సమస్య పరిష్కారం కాకపోతే విధులనే బహిష్కరిస్తామని హెచ్చరించారు.

### దవాఖానల నిర్వహణను గాలికొదిలిన సర్కారు: హరీశ్‌రావు

దవాఖానల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. విషజ్వరాలు విజృంభించి రోగులతో దవాఖానలు కికిరిసిపోతున్నా, నిధులు విడుదల చేయకుండా చోద్యం చూస్తున్నదని ధ్వజమెత్తారు. టీవీవీపీ దవాఖానల్లోని శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తక్షణమే వారికి పెండింగ్ వేతనాలను చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్టు చెప్పుకునే ముఖ్యమంత్రికి వీరి వెతలు కనిపించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. సిబ్బంది ఎన్నిసార్లు నిరసనలు తెలిపినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని, వారి గోడును పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ఏలేరు విలయం



32 వేల క్యూసెక్కులకు మించి వరద పారుతుండడంతో ఏడు మండలాల్లో 26 చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో వరద నీరు మొత్తం 45 వేల ఎకరాలకు పైగా ముంచేసింది. జిల్లాలో ఈ ఏడు మండలాల్లో ఎక్కడ చూసినా వరి చేలు నదులను తలపిస్తున్నాయి. వీటిపైన ఆరడుగులకు మించి వరద ప్రవహిస్తుండంతో నష్టం భారీగా ఉంది.

### తీవ్ర నష్టం

వరద ఉధృతానికి సామర్లకోట-ప్రత్తిపాడు, పిఠాపురం-సామర్లకోట, కిర్లంపూడి-దివిలి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చేలల్లో ఉన్న ఇటుకబట్టీలు, బెల్లం క్రషర్లు, కోళ్లఫారాలు కొట్టుకుపోయాయి. హోటళ్లు, దాబాలు, గోదాముల్లోకి వరద వచ్చేసింది. ఏలేరు వరదతో పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలంగా మారింది. గొల్లప్రోలు, ఏలేరు వరదకు సుద్దగడ్డ వరద కూడా తోడవడంతో వరద నష్టం తీవ్రంగా ఉంది. ఈ ఒక్క మండలంలోనే 8,500 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. 216 జాతీయ రహదారి వెంబడి చేలన్నీ భారీ నదులను తలపిస్తున్నాయి. ఏలేరు కాలువకు అత్యధికంగా గొల్లప్రోలు మండలంలో 6 చోట్ల గండ్లు పడ్డాయి. పది గ్రామాలు నీటమునిగాయి. పిఠాపురం మండలంలో ఏలేరు కాలువకు 9 చోట్ల గండ్లు పడడంతో 14 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు మునిగిపోయాయి. వరద నీరు ప్రధాన రహదారులపైకి వచ్చేయడంతో ఏడింటిని మూసేశారు. 15 గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి. కిర్లంపూడి మండలంలో ఏలేరు కాలువకు మొత్తం పదిచోట్ల భారీ గండ్లు పడ్డంతో 16వేల ఎకరాల్లో వరి, ఇతర వాణిజ్య పంటలు పూర్తిగా వరదలో మునిగిపోయాయి. కాలువలకు గండ్లు పడ్డంతో మొత్తం 21 గ్రామాల్లో వరద చేరిపోయింది. పిఠాపురం నుంచి గొల్లప్రోలు వెళ్లే దారిలో రాపర్తి నుంచి టోల్‌గేట్ వరకు వరద జాతీయ రహదారిపైకి వచ్చేసింది. ఉదయం మోకాల్లోతులో ఉండే వరద సాయంత్రానికి ఆరు అడుగులకు చేరిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో పోలీసులు ఒకవైపు రాకపోకలను నిలిపివేశారు. గొల్లప్రోలు, పిఠాపురం శివారు ప్రాంతాల్లోని అనేక కాలనీలను మంగళవారం రాత్రి వరద ముంచేయడంతో బాధితులు ఆకలితో అలమటించారు. ఇళ్లలోకి నీరు వచ్చేయడంతో బయటకు వచ్చే మార్గం లేక అటు సాయం చేసేవారు లేక ఇబ్బందులు పడ్డారు. ఏలేరు వరద సహాయక చర్యలపై సైనిక బలగాలు దృష్టి సారించాయి. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కాండ్రకోట తదితర గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టనున్నాయి. చుట్టుపక్కల ఉన్న 500 కుటుంబాలు ఏలేరు వరద కారణంగా ప్రమాదకర స్థితిలో ఉన్న నేపథ్యంలో సైనిక బలగాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి. ఏదైనా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడితే చర్యలు చేపట్టేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్, బోట్ అసాల్ట్ యూనిట్లను కూడా సిద్ధం చేశారు.

### ప్రమాదకరంగా ఏలేరు

ఎగువప్రాంతాల నుంచి వరద నీరు అధికంగా వస్తుండడంతో ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టు పరిస్థితి ప్రమాదకరంగానే ఉంది. మంగళవారం రిజర్వాయర్‌లో 86.56 మీటర్ల నీటిమట్టానికిగాను 85.60 మీటర్ల మేరకు నీరు ఉంది. రాత్రి 10 గంటలకు ఏలేరు రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో 18,102 క్యూసెక్కులుగా ఉండగా.. 18,360 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

# ప్రగతి పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించిన షీ టీం పోలీసులు




**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని స్థానిక ప్రగతి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌చార్జి వాణి మాట్లాడుతూ బాలికల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమన్నారు. పాఠశాలలో కానీ, బయట ఎక్కడైన ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 100, 1098 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలికలను, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు చిన్న విషయాలకు ఆవేద నకు గురికాకూడదని మంచి ఆలోచనతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనపై కూడా దృష్టి సారించాల న్నారు. క్రమశిక్షణతో ఉండేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో కరస్పాండెంట్ సురకంటి వనమాల ప్రిన్సిపాల్ ఐ రాజ్యలక్ష్మి వైస్ ప్రిన్సిపాల్ ఏనుగు మంజుల, ప్రవీణ్, నిజాముద్దీన్, లక్ష్మణ్, అశోక్ (పీ.ఇ.టీ) అల్లం సాయికిరణ్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణేష్ నగర్ వినాయకుడి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం విజయవంతం: రెండవ వార్డ్ కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్

శంకర్‌పల్లి: సెప్టెంబర్ 10: (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డు గణేష్ నగర్ కాలనీలో నెలకొల్పిన వినాయకుడి మండపం వద్ద మంగళవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన బిసోల్ల జయమ్మ సురేందర్ దంపతులను కౌన్సిలర్ సంధ్యారాణి శాలువాతో ఘనంగా సన్మానించారు. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాలనీ వాసులకు, వినాయక కమిటీ సభ్యులకు కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు. రాత్రి వినాయక మండపంలో శబరిస భక్తమండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దండు మోహన్, మిరియాల శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, గుండ శేఖర్, విశ్వేశ్వర్, మధు, నటరాజ్, రాము, పూర్ణ, శ్రీనివాస్, నరేష్, రఘు,శ్రీకాంత్ పాల్గొన్నారు.



## షాద్ నగర్ ఎన్హెచ్ 44 హెూటల్ దగ్గర మాజీ మంత్రి హరీష్ రావు


### సీఎం రేవంత్ రెడ్డి పై ఘాటుగా విమర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

### యూట్యూబర్లు/సోషల్ మీడియా లేకపోయి ఉంటే నీ గెలుపు ఎక్కడ

### అధికారంలోకి రాగానే అన్ని మర్చిపోయావా రేవంత్ రెడ్డి




షాద్‌నగర్ ఎ (10 సెప్టెంబర్ డైలీ రిపోర్ట్): జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే చర్లకోల లక్ష్మారెడ్డి భార్య శ్వేత రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో టిఆర్ఎస్ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించడానికి జడ్చర్ల వెళుతున్న తరుణంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎన్ హెచ్ 44 హైవే పైన టిఆర్ఎస్ ముఖ్య నాయకులు అయినటువంటి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మరియు షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లతో కలిసి జడ్చర్ల బయలుదేరుతున్న సమయంలో హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ,, రేవంత్ రెడ్డి యూట్యూబర్లపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. అధికారంలో రాకముందు ఈ యూట్యూబ్ ఛానల్ ని అడ్డం పెట్టుకొని అడ్డమైన వ్యాఖ్యలు చేసి అవాస్తవాలను వాస్తవాలు చేసింది నువ్వు కదా, ఇప్పుడు అవే యూట్యూబ్ ఛానల్ నీ అక్రమాలను, నీ మాట తప్పిన తీరును, నీ మోసలను ఎండ కట్టడానికి పనిచేస్తున్నాయని యూట్యూబ్ ఛానల్ లను తక్కువ చేసి మాట్లాడమన్నది చాలా విడ్డూరంగా ఉంది అన్నారు. రేవంత్ రెడ్డి తన అవసరమైతే ఒక తీరు అవసరమయ్యే ఒక ఇంకో తీరు అంటే ఒడ్డు దాటకముందు ఓడ మల్లన ఒడ్డు దాటక బోడ మల్లన్న తీరులో ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. ఈ యూట్యూబ్ లను వాడుకొని గత ప్రభుత్వం మీద ఆరోపణలు చేసి, ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు చెప్పి అధికారంలోకి వచ్చింది నువ్వు కాదా, నీ బండారని బట్టబయలు చేసి నీ అవినీతిని బయట పెడుతుంటే తట్టుకోలేక పోతున్నావు. మీ అక్కసును యూటోబర్ల మీద చూపిస్తున్నావు బిడ్డ యూట్యూబర్లు తలుచుకుంటే గద్య దించడం పెద్ద విషయం ఏమి కాదు గుర్తుంచుకో అంటూ విమర్శించారు.



## పిసిసి అధ్యక్షుడిని కలిసిన ఆడే గజేందర్

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో::** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియామితులైన శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ఎమ్మెల్సీ గారిని వారి స్వగృహంలో శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం ఇస్తుందని, దీనికి నిదర్శనం పిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ గారి నియామకం అని,కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గ మెజార్టీ స్థానాలు గెలవాలని నూతన పీసీసీ అధ్యక్షులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తదితరులు పాల్గొన్నారు

## రాళ్లకత్వ గ్రామంలో కంకర క్రషర్ క్వారీలను సందర్శించిన మైనింగ్ అధికారులు



**జిన్నారం , సెప్టెంబర్ 10 డైలీ రిపోర్ట్:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం సోలక్పల్లి రెవెన్యూ రాళ్లకత్వ గ్రామ శివారిలో ఏర్పాటు చేస్తున్న నూతన కంకర క్రషర్ క్వారీల పై వాస్తవ సమాచారాన్ని ఇవ్వాలని స్టేట్ మైన్స్ ఆఫ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ ఏడి సంగారెడ్డి డిడి నిజామాబాద్ రెవెన్యూ అధికారులు విచ్చేసి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన స్థలాన్ని సందర్శించడం జరిగింది. గ్రామస్తులు చుట్టుపక్కల ఉన్న చెరువులను కుంటలను కాలువలను పంట పొలాలను చూపించడం జరిగింది. రైతులు వాస్తవ సమాచారాన్ని ఉన్నతాధికారులకు రిపోర్ట్ ఇవ్వాలని విచ్చేసిన అధికారులకు కోరడం జరిగింది . ఈ కార్యక్రమంలో శివానగర్ రాళ్లకత్వ దాదిగూడ గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో ఘనంగా చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి నివాళులర్పించిన: ఎమ్మెల్యే యాదయ్య



**చేవెళ్ల సెప్టెంబర్ 10 (డైలీ రిపోర్ట్):** చేవెళ్ళ మండల కేంద్రంలో 39 వ చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించిన లిస్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు,నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

# పొద్దుటూరులో ఘనంగా చాకలి ఐలమ్మ 39 వ వర్ధంతి

### తొలి భూ పోరాటానికి నాంది పలికిన విప్లవ ధ్రువతార చాకలి ఐలమ్మ

### వీర వనిత చిట్యాల ఐలమ్మ కనపరిచిన ధైర్యసహసాలు మహిళా శక్తికి ప్రతీక


### ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి వెల్లడి



శంకర్ పల్లి సెప్టెంబర్ 10 (డైలీ రిపోర్ట్): తెలంగాణ తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీర వనిత చిట్యాల ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా పొద్దుటూరు గ్రామ మాజీ ఎంపిటిసి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి పొద్దుటూరు గ్రామంలోని, పంచాయతీ వద్ద ప్రతిష్టించిన చాకలి ఐలమ్మ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.., వీర వనిత విప్లవ ధ్రువతార చాకలి ఐలమ్మ భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ఆధిపత్య వర్గాల భూ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడి అణగారిన వర్గాలకు మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు . తెలంగాణ సాయుధ పోరాటంలో పాలు పంచుకొని మహిళలను ఐక్యం చేసిన స్ఫూర్తి ప్రదాత చాకలి ఐలమ్మ అని అన్నారు. చాకలి ఐలమ్మ ప్రేరణతో అనేకమంది మహిళలు ఆనాటి భూ పోరాటానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని, ఐలమ్మ ప్రతిఘటన తత్త్వం బహుజన చైతన్యానికి మహిళా శక్తికి ప్రత్యేక గా నిలిచిందని కీర్తించారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నవాబులకు,ఆయన తొత్తులైన భూస్వాములకు వ్యతిరేకంగా, జరిగిన పోరాటంలో తన ఇల్లునే కార్యాలయంగా మార్చిందని అన్నారు. చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటి ప్రజలందరికీ ఆదర్శప్రాయమని ఆమె ప్రదర్శించిన ధైర్య సాహసాలు ఎల్లప్పుడు తెలంగాణ ప్రజలందరికీ స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పొద్దుటూరు , గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు, కావేలి రాంరెడ్డి, చాకలి రాములు, పెద్దలు బొల్లారం మోహన్ రెడ్డి, కావేలి జంగారెడ్డి, పులకండ్ల రఘుపతి రెడ్డి, కె విష్ణువర్ధన్ రెడ్డి, క్రాంతి యువజన సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్లేశం, చాకలి వెంకటేష్, మాజీ వార్డు సభ్యులు కవేలి గోవర్ధన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, చాకలి మల్లేశ గ్రామ పెద్దలు మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో ఓ మహిళ నుంచి 45 వేలు దోచుకెళ్లారు.....

**చేవెళ్ల: సెప్టెంబర్ 10 ఎ డైలీ రిపోర్ట్ :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని ఓ మహిళ డబ్బు డిపాజిట్ చేసేందుకు బ్యాంకుకు వచ్చి, కొన్ని కారణాల వల్ల బ్యాంకులో డిపాజిట్ కాకపోవడంతో తిరిగి వస్తుండగా బస్సు ఎక్కుతుండగా 45 వేల కవరు మాయమైంది. స్థానిక బస్టాండ్‌లో ప్రతిరోజూ దొంగతనాలు జరుగుతున్నాయి. బాధితురాలు సాబాద్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. బస్సు ఎక్కే సమయంలో చాలా మంది గుమిగూడారని, ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కవర్ కనిపించడం లేదని బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.....



# మలయాళ ఇండస్ట్రీని నాశనం చేయకండి: మోహన్‌లాల్



మలయాళ చిత్రపరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక దాడులకు సంబంధించి కేరళ ప్రభుత్వానికి హేమా కమిటీ నివేదిక సమర్పించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 17 మంది మలయాళ సినీ ప్రముఖులపై కేసులు నమోదైనట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇలా ఇండస్ట్రీలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని 'అమ్మ' (అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్) అధ్యక్షుడు మోహన్‌లాల్, 'అమ్మ' కమిటీ సభ్యులు మూకుమ్మడిగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అప్పట్నుంచి ఈ వివాదంపై మోహన్‌లాల్ మాట్లాడలేదు. హేమా కమిటీ నివేదిక, ఇండస్ట్రీలో జరుగుతున్న తాజా పరిణామాల గురించి కేరళలోని తిరువనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో మోహన్‌లాల్ ఈ విధంగా మాట్లాడారు. ఏ పవర్ గ్రూప్‌లోనూ లేను: హేమా కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం. నేను కూడా కమిటీ ముందు హాజరై, నాకు తెలిసిన అన్ని విషయాలను పంచుకున్నాను. వాటిని ఇక్కడ చర్చించలేను. అలాగే కమిటీ నివేదికలో పేర్కొన్న ఏ పవర్ గ్రూప్‌లోనూ నేను లేను. అయినా నివేదికలో చాలా అంశాలు ఉన్నాయి. అన్నింటికీ 'అమ్మ'నే కారణం అంటూ మాట్లాడటం కరెక్ట్ కాదు. మలయాళ పరిశ్రమ అంతా కలిసి స్పందించాల్సి ఉంది (ఇండస్ట్రీలో ఉండే పలు విభాగాల దర్శక-నిర్మాతలు, నటీనటులు వంటి సంఘాలు). నిజంగా తప్పులు చేసిన వారిని కోర్టు శిక్షిస్తుంది.పోలీసులు నివేదిక అంశాల పైనే పని చేస్తున్నారు.అందుకే కేరళ నుంచి బయటకు వెళ్లాను: సమాజంలో సినిమా అన్నది ఓ భాగమే. హేమా కమిటీ నివేదిక ప్రస్తావనల పైనే దృష్టి సారిస్తూ మలయాళ పరిశ్రమను నాశనం చేయకండి.



# నేను కాదు... సరస్వతి కనిపిస్తుంది నివేదా థామస్


"సింపుల్ అండ్ బ్యూటిఫుల్ స్టోరీతో రూపొందిన చిత్రం '35-చిన్న కథ కాదు'. ఈ సినిమాలో తల్లి పాత్ర చేయడానికి ఆలోచించలేదు. ఓ నటిగా అన్ని పాత్రలూ చేయాలి. ఈ మూవీలో నివేదా థామస్ కాకుండా నేను చేసిన సరస్వతి పాత్రే కనిపిస్తుంది" అని హీరోయిన్ నివేదా థామస్ అన్నారు. ప్రియదర్శి, నివేదా థామస్, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35-చిన్న కథ కాదు'. నంద కిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న తెలుగు, తమిళ, మలయాళంలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నివేదా థామస్ మాట్లాడుతూ- "నంద కిశోర్ '35%-%చిన్న కథ కాదు' కథని అద్భుతంగా రాశారు. విద్యా వ్యవస్థ గురించి గొప్పగా, భార్యాభర్త, పిల్లలు, టీచర్, స్టూడెంట్స్... ఇలాంటి బంధాల గురించి అందంగా చెప్పారు. ఈ సినిమా చూస్తున్నంత సేపూ కె. విశ్వనాథ్‌గారి సినిమా చూస్తున్న అనుభూతి కలుగుతుంది. ఈ సినిమాలో వెంకటేశ్వర స్వామిని కూడా ఓ పాత్రలా చూపించారు దర్శకుడు" అన్నారు. హేమాలాంటి కమిటీలు రావాలి: "మలయాళ చిత్ర పరిశ్రమలో ఉండటాన్ని నేను గర్వంగా భావిస్తున్నాను. 'అమ్మ'లో నేను ఓ సభ్యురాలిని. హేమా కమిటీ నివేదికలో వెలుగు చూసిన అంశాలు బాధాకరం. ఆ విషయాల గురించి నేను నా కుటుంబ సభ్యులతో కూడా చర్చించాను. ఈ విషయంలో డబ్ల్యూసీసీ (ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్)ని ప్రశంసించాలి. పని చేసే చోట మహిళలకు భద్రత కల్పించడం కనీస అవసరం. దీని గురించి నేనూ వినతి చేశాను. మలయాళ చిత్ర పరిశ్రమలోలాగే ఇతర ఇండస్ట్రీల్లోనూ హేమా లాంటి కమిటీలు వస్తే మంచిదే" అన్నారు నివేదా థామస్.


# బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.. మారుతినగర్ సుబ్రహ్మణ్యంపై మహేశ్ బాబు

విలక్షణ నటుడు రావు రమేశ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం మారుతి నగర్ సుబ్రహ్మణ్యం మారుతి నగర్‌లో ఫన్ మొదలైంది అంటూ. . ఆగస్టు 23న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. తాజాగా ఈ సినిమాపై మహేశ్ బాబు తన తన స్పందనను తెలియజేశాడు.ఉల్లాసవంతమైన ప్రయాణం.. ఇటీవల కాలంలో వచ్చిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లలో ఉత్తమ చిత్రం మారుతి నగర్ సుబ్రహ్మణ్యం. తబిత సుకుమార్ అండ్ చిత్రయూనిట్‌కు అభినందనలు.. అని ట్వీట్ చేశాడు మహేశ్ బాబు. ఇప్పుడీ ట్వీట్ మూవీ లవర్స్‌లో సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఈ చిత్రానికి హ్యాపీ వెడ్డింగ్ ఫేం లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించగా.. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి లీడ్ రోల్స్‌లో నటించారు. ఇంద్రజ కీలక పాత్ర పోషించింది. బుజ్జి రాయుడు పెంట్యాలా, మోహన్ కార్య సంయుక్తంగా తెరకెక్కించారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ఎల్‌ఎల్‌పీ విడుదల చేసింది. పీబీఆర్ సినిమాస్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది.. ఈ బ్యానర్‌లో వచ్చిన రెండో చిత్రమిది.



# కర్రసాము నేర్చుకుంటున్న శృతిహాసన్..





ఇంతకు ముందు సినీ హీరోలు తాము నటించే చిత్రాల కోసం తీవ్రంగా హోమ్‌వర్క్ చేస్తుండేవారు. అయితే, ఇప్పుడు హీరోయిన్లు కూడా తమ పాత్రల కోసం భారీగానే కసరత్తులు చేస్తున్నారు. తాజాగా నటి శృతిహాసన్ తన పాత్రకు న్యాయం చేయడం కోసం చాలా కష్టపడుతుంది. పాన్ ఇండియా రేంజ్‌లో రాణిస్తున్న ఈ చెన్నై బ్యూటీ మొదట హిందీలో లక్ అనే చిత్రం ద్వారా కథానాయకిగా ఎంట్రీ ఇచ్చినా, ఆ తరువాత కోలీవుడ్, టాలీవుడ్‌ల్లో నటిస్తూ పాపులర్ అయింది. నిజం చెప్పాలంటే తమిళంలో కంటే తెలుగులోనే శృతిహాసన్‌కు మంచి క్రేజ్ ఉంది. తెలుగులో ఈమె నటించిన చిత్రాలన్నీ హిట్టే అని చెప్పవచ్చు. అలా టాప్ హీరోయిన్‌గా రాణిస్తున్న శృతిహాసన్ తన సొంత భాష తమిళంలో నటించి మూడేళ్లకు పైగా అయ్యింది. ఈమె నాయకిగా నటించిన తమిళ చిత్రం లాభం తెరపైకి వచ్చి మూడేళ్లు అయ్యింది. అలా సుదీర్ఘ గ్యాప్ తరువాత శృతిహాసన్ కోలీవుడ్‌లో నటిస్తున్న చిత్రం కూలీ. రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆమె ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ భారీ తారాగణంతో భారీ ఎత్తున నిర్మిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ఈ చిత్రంలో శృతిహాసన్ నటిస్తున్నట్లు చిత్ర వర్గాలు ఒక పోస్టర్‌ను విడుదల చేశాయి కూడా. ఇందులో ఆమె పాత్ర చాలా శక్తివంతమైనదిగా తెలుస్తోంది. చిత్రంలో ఆమెకు ఫైట్ సన్నివేశాలు కూడా ఉంటాయని తెలుస్తోంది. అందుకోసం ఆమె ఆత్మరక్షణ విద్య అయిన కర్రసాములో శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయో సామాజిక మాధ్యమాలకు విడుదల చేశారు. అందులో ఆమె తన తండ్రి, ప్రఖ్యాత నటుడు కమలహాసన్ కూడా ఇంతకు ముందు దేవర్‌మగన్ (క్షత్రియ పుత్రుడు) చిత్రంలో కర్రసాము విద్యను ప్రదర్శించారని, అలాగే తానూ ఈ ఆత్మరక్షణ విద్యలో శిక్షణ పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఈమె వీడియో ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది.

# దీపికా పదుకొనే ఖాతాలో మరో ఖరీదైన విల్లా..

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాప్ స్టార్ యాక్టర్లలో ఒకరు బీటౌన్ భామ దీపికా పదుకొనే రన్ వీర్ సింగ్-దీపికాపదుకొనే దంపతులు త్వరలోనే మొదటి సంతానానికి స్వాగతం పలుకబోతున్నారని తెలిసిందే. ఇదిలా ఉంటే దీపికాపదుకొనే ఆసక్తికర అప్‌డేట్‌తో వార్తల్లో నిలిచింది. ముంబై సర్కిల్‌లో రౌండప్ చేస్తున్న కథనాల ప్రకారం దీపికాపదుకొనే ఖరీదైన విల్లాను కొనుగోలు చేసింది. 11,266 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ అపార్ట్‌మెంట్ బాలీవుడ్ స్టార్ యాక్టర్ షారుఖ్ ఖాన్ నివాసమైన మన్నత్‌కు సమీపంలో ఉండటం విశేషం. ఈ భవంతి ఖరీదు రూ.100 కోట్లని అంచనా. ఈ నాలుగంతస్తుల భవనం దీపికాపదుకొనే అభిరుచులకు అనుగుణంగా డిజైన్ చేసుకుందట. త్వరలోనే ఈ ఇంట్లోకి మారనున్నట్టు వార్త కూడా నెట్టింట వైరల్ అవుతోంది. చాలా ఏండ్లుగా వన్ ఆఫ్ ది లీడింగ్ స్టార్‌గా కొనసాగుతున్న దీపికాపదుకొనే.. మరోవైపు రియల్ ఎస్టేట్‌లో కూడా పెట్టుబడులు పెట్టిందని తెలిసిందే.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707